గురువు గడియారం మాత్రం 'దగ్గరకి వచ్చేసాం, దగ్గరకి వచ్చేసాం' అని శబ్దం చేస్తుంది. అందుకనే ఆ గడియారం మా గురువు గారిదని గుర్తించ గలిగాను." వివరించాడు ఆ సన్యాసి.

## 28. పరికరాలం మాత్రమే

ఓ హరిదాసు శ్రీమత్ భాగవతంలోని జడ భరతుడి కథ చెప్తున్నాడు.

"నిండు గర్భవతి అయిన ఓ ఆడ లేడి ఓ వాగులోని నీటిని తాగబోతూండగా, అక్కడికి వచ్చిన పులిని చూసి భయంతో ఆ వాగు మీంచి అవతలి గట్టుకి దూకబోయి కిందపడింది. ఆ తాకిడికి అది మరణించింది. దాని పిల్ల వెంటనే గర్భంలోంచి సురక్షితంగా బయటకి వచ్చింది.

"పుట్టుకతోనే తల్లిని కోల్పోయిన దాన్ని చూసి భరతుడు జాలిపడి తన వెంట ఆశ్రమానికి తీసుకెళ్ళి దాని బాగోగులని చూసుకోసాగాడు. దాని మీద అతనికి ప్రేమ ఎంతగా ముదిరిందంటే, తన మరణకాలంలో ఆఖరి క్షణంలో అతనికి 'తను లేకపోతే ఆ లేడి పిల్లని ఎవరు చూస్తారా' అన్న ఆలోచన వచ్చి, అదే గుర్తుకు వచ్చింది. దాంతో అతనికి ముక్తి బదులు లేడి జన్మ వచ్చింది. కాబట్టి మనం దేన్ని అధికంగా ప్రేమించినా ప్రాణం పోయేప్పుడు అదే స్మరణకి వచ్చి ముక్తికి అడ్డు పడుతుంది."

దారిన పోయే ఓ మహాత్ముడు ఆ కథని విని, చివర్లో హరిదాసు ముగింపుగా చెప్పిన వాక్యాలకి పెద్దగా నవ్వాడు.

శ్రోతల్లో ఒకరు వెంటనే లేచి ఆయనకి నమస్కరించి వినయంగా అడిగాడు.

"హరిదాసు చెప్పిందాంట్లో మీకేం తప్పు కనిపించింది? లేకపోతే మీరలా నవ్వి వుండేవారు కాదు. దయతో మాకు వివరించండి."

ఆ మహాత్ముడు అంతా వినేలా చెప్పాడు.

"ఈ కథని ఇలా విన్నవాడు ఎన్నడూ ఆపదలో వున్న ఎవరికీ సహాయం చేయకూడదు అని భ్రమించే అవకాశం వుంది. భరతుడు చేసిన పొరబాటు నిజానికి ఆ లేడి పిల్లని ప్రేమించడం కాదు. దేవుడ్ని విస్మరించడం. తన ద్వారా దేవుడు ఆ

లేడిపిల్లని రక్షించాడని, తన మరణానంతరం కూడా దేవుడు దాన్ని కాపాడుతాడని, తను దేవుడి చేతిలో కేవలం ఓ పరికరం మాత్రమేనని అనుకోకపోవడమే భరతుడు చేసిన తప్పు. అలా భావిస్తే ప్రాణోత్క్రమణ సమయంలో అతనికి ఆ లేడిపిల్ల బాగోగుల మీద ఎలాంటి ఆలోచనా రాక, దేవుడ్ని స్మరించి వుండేవాడు. మనమంతా కూడా చేసే పొరబాటు ఇదే. మనం చేసే ప్రతీదీ మనమే స్వతంత్రంగా చేస్తున్నాం అనుకుంటాం కాని ఆ భగవంతుడే మన చేత చేయిస్తున్నాడని గాని, ఆయన చేతిలో మనం పరికరాలుగా వాడుకోబడుతున్నాం అని కాని అనుకోం. ఈ విషయాన్ని నమ్మి దాన్ని అలా స్థిరంగా, పరిపూర్ణంగా, అఖండంగా అనుకున్న రోజు జడ భరతుడికి పట్టిన గతి మనకెవ్వరికీ రాదు. ఈ సాధన ముక్తికి దగ్గర దారి."

## 29. కర్మ పని తీరు

ఓ గురువు తన శిష్యుడికి కర్మ సిద్ధాంతం గురించి బోధించాడు. శిష్యుడి అనుమానాలు తీరి, అది అతనికి చక్కగా అర్థమయ్యేందుకు అతనికి ఓ స్పర్శవేదిని ఇచ్చి చెప్పాడు.

"దీన్ని ఇనుప వస్తువులకి తాకిస్తే వెంటనే ఆ ఇనుము బంగారంగా మారుతుంది. మన మఠం వీధి చివరి ఇంట్లోని దరిద్రుడికి దీన్ని ఇచ్చినా వాడు పూర్వ జన్మ కర్మ ఫలితం ప్రకారం ఈ జన్మలో ఐశ్వర్యాన్ని అనుభవించలేకపోవడం నువ్వు గమనించవచ్చు. అప్పుడు కర్మ ఎలా పని చేస్తుందో నీకు అర్థం అవుతుంది. వెళ్ళు. ఓ వారం పాటు దీన్ని వాడి ఆధీనంలో వుంచిరా."

శిష్యుడు దాన్ని తీసుకెళ్ళి ఆ దరిద్రుడికి ఇచ్చి చెప్పాడు.

"దీన్ని ఇనుముకి తాకిస్తే అది బంగారం అవుతుంది. పై గురువారం దాకా దీన్ని నీ దగ్గర వుంచుకో. మళ్ళీ గురువారం సరిగ్గా ఈ సమయానికి వచ్చి దీన్ని నేను తీసుకెళ్తాను."

ఆ దరిద్రుడు తన ఇంట్లోని ఇనప మేకుకి దాన్ని తాకించాలనుకున్నాడు. కాని అతని భార్య చెప్పింది.